
# ది ఎండ్

**జెపి వైద్య**

పువ్వుల డిజైన్ల పరదాలు సంకోచిస్తూ వదులుతున్నాయి. పువ్వుల్లోంచి విడదీయలేరంటున్న 'మనీప్లాంట్' ఆకులు మురిపెంగా అల్లరి చిల్లరిగా తలలూపుతున్నాయి.

తల వంచుకున్న జయా కూర్చున్న చోటే ఆకు కూరల్లోంచి కచరాపట్టీని ఏరివేసే కార్యక్రమంలో తలమునకలై పోయి లడ్డూ క్రింద ఆరామ్‌తో తలమీద పడ్తున్న ఆకుల తుక్కును అదిలిస్తూ కాస్తంత బేచైన్ మొహం పెట్టాడు. 'లడ్డూ' మా పెంపుడు ఆల్సేషియన్ కుక్క.

కిటికీ దగ్గర సోఫామీద 'ఇప్పుడు పడ్తాడో కాసేపయ్యాక పడ్తాడో' అన్న స్టైల్లో తనలో తాను గున్‌గునాయి కుంచుటున్నాడు మా 'ఠాకూర్ సాబ్'




'ఇంకోసారి చాయ్ తెప్పిస్తే బాగుంటది భాయిసాబ్' అనే 'ఇషారా' వ్యక్తం చేసాడు సర్దార్ అలమ్ సాబ్.

"నేనెప్పుడైనా చక్కరొచ్చి పడ్తే గిడ్తే వీడి దగ్గరికి తీసుకొచ్చి సెలైన్‌లూ, గ్లూకోజ్‌లా ఎక్కించొద్దు. లొల్లి చెయ్యకుండా నా చెవులల్ల జొర్రీగ తీరు ఒర్రుండ్రి. ఆలమ్‌సాబ్.. చాయ్ ఆగయ్యా" అని తన 'ఆత్మచరిత్రలో మొదటి ప్లస్ ఆఖరి పేజీలో రాసుకున్నాడాయన.

మా అదృష్టం కొద్దీ అది ప్రింట్ కాలేదు. కాని కనీసం రెండు మూడుసార్లైనా పునర్ముద్రణకు నోచుకోకపోతుందా అన్న అందమైన ఆత్మవిశ్వాసంతో 'చాయ్'ల కోసం జీవిస్తున్న మాజీ 'షికారీ' ఆయన.

ఆయన 'డబుల్ బ్యారెల్ గన్'తో ఒకే తూటాతో రెండు వన్యప్రాణులను నేల కొరిగించిన ఘనత ఉన్నా చాయ్.. అందకపోతే 'చాప' లేకున్నా నేలమీద శోష వచ్చి పడే ఘనాఘనుడాయన.

ఇవ్వన్నీ ఏమీ పట్టించుకోక ఓ క్షణం నావైపూ మరోక్షణం జయావైపూ చూసి ఇబ్బందిగా కదిలాడు. నవాబ్ హాదీఖాన్'




''భా..భాభీ జాన్! ఆప్ క్యూం తక్‌లీఫ్ ఉఠాతే హై! హమ్ పూరా ఇంతెజామ్ కరాదేతే హై! సిర్ఫ్ ఆప్ హమారే సాథ్ రహియేగా! బస్!!'' అన్నాడు.

జయ సుతారంగా నవ్వింది.

మనీప్లాంట్ ఆకులు సిగ్గుపడి పరదాలను వదిలేశాయి.

'చాయ్ వచ్చిందేమో!' దిగ్గున లేచి కూర్చున్నాడు సర్దార్.

నేను తలెత్తి చూశాను.

''ఏక్ బంగ్లా బనే న్యారా.. సన్నని తెరల్లోంచి సైగల్''

ఇదంతా చదివి ఆహా ఇదేదో హ్యాపీహోంలో హ్యాపీ మూమెంట్స్ 'ది ఎండ్' లేని సిన్మాలా బావుందిరోయ్ అని మీరు అనుకుంటే 'పప్పు'లో కాదు. 'తుపాకుల ర్యాక్'లో చేతులూ, తూటాల డబ్బాలో కాళ్ళూ వేసి కలవరపడ్డట్టే.

'రాజేమధూకర్ దేశ్‌ముఖ్'గారు మా కోసం ప్రత్యేకంగా వస్తున్నారు. వారి విడిది కోసం అన్నీ ఏర్పాట్లు చేసి 'రాక'కన్నా ముందు వార్తకోసం ఎదురు చూస్తున్నాం.

రాజుగారు కొండంతే కాదు కొండమీది కోటంత చరిత్ర వుంది.

మా ఆదిలాబాద్‌కు దాదాపు 85 కిలోమీటర్ల దూరంలో మహోర్ వుంది. నేటికీ దట్టమైన మహారణ్యాలూ, ముచ్చటైన చిట్టడవుల మూడు పర్వత శిఖరాల్లో భయోత్పాతం కల్గించే లోయతో వింధ్యా సత్పూరా పర్వత శిఖరాల సంతకాలు-అంటేనే 'మహోర్'.

మహారాష్ట్రియన్‌లు ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుచుకునే పవిత్ర తీర్థ స్థలం. రేణుకామాతా, దత్తశిఖరం, అనుసూయా మాతా మందిరం. మహంకాళీ, పరశురాం మందిరాలూ, లెక్కలేనన్ని నీటి కుద్యాలూ ఉన్న చారిత్రాత్మక ప్రదేశం.

యాదవులూ, బహమనీ, మొగల్, ఆంగ్లేయులూ, నిజాం ఇలా తరతరాల రాజ వంశజులతో ముడివేసుకున్న అలనాటి ముఖ్యమైన రాజుల చరిత్రలు రాసుకున్న కోట. దూరంనుంచే అందమైన ఆకుపచ్చ చెట్ల తివాచీ మధ్య తలెత్తి ఠీవిగా నిలబడి వుంది ఇంకా.

అక్కడక్కడా జవసత్వాలూడినట్లు బురుజులు కూలబడ్డా,నీలిరాళ్ళ తాపడాలూ చేసిన 'ఢిల్లీ దర్వాజా' ఇంకా మొండిగా నిలబడి వుంది.

'' ఏమర్రా! అలా చూస్తారు భయం భయంగా. పన్నెండేళ్ల పిల్లవాడిగా ఉన్నప్పుడు నా బురుజులన్నీ తిరిగి ఆటలాడుకున్నాడు ఔరంగజేబ్. ఇప్పుడు ఔరంగజేబూ లేడు. శివాజీ లేడు. కత్తులూ లేవు. తుపాకులూ లేవు. వుంటే గింటే ఏ రాళ్ళ చాటునో చిరుతపులులో, కొండ చిలువలో ఉండొచ్చు. భయపడకుండా రండర్రా!'' అని పలకరించే విశాలమైన కోట.

ఔరంగజేబు రోజుల్లో 'సూరత్'ను కొల్లగొట్టి వచ్చాడు ఛత్రపతి శివాజీ. ఆయన్ను ధైర్యంగా ఎదుర్కొన్న వీరవనిత 'రాయబాగన్' ముని ముని ముని మనుమడు 'రాజే మధూకర్ రావ్ దేశ్‌ముఖ్'

కోటను కొండమీదే వదిలేసి క్రింది ఊళ్ళో 'హవేలీ' కి దిగివచ్చి శతాబ్దం అయి ఉండొచ్చు. కాని, రాజుల ఠీవి అందాలు తరిగిపోలేదు.

కోట బురుజుల్లాగే హవేలీ అక్కడక్కడ శిథిలావస్థకు చేరుకున్నది నేడు.

అలనాటి గజశాల, మహోర్ మ్యూజియంగా మారింది. అయినా హవేలీలో కాసేపు తిరుగాడితే దూరంగా గంటలు వినిపిస్తాయి. ఆ గంటలు గజరాజులవి కావు. కొండమీది రేణుకామాతా ఆలయంనుంచి గణగణనాదాలు పలికే గంటల చప్పుళ్ళు, మినుకు మినుకు మనే దీపాలూ అలనాటి 'షికారీ రాజసుల' దిక్కూచి గడియారాలు.

'అవునూ-కాదూ' అని చెప్పడానికి, అలనాటి రాజుల చరిత్ర అంతే అరుదైన 'షికారీల చరిత్ర'ను తన కళ్ళతో చూసిన పురాతనమైన పెద్ద మర్రిచెట్టు ఇంకా నిలబడి వుంది పెరటి మైదానంలో.

వయస్సు వల్ల పళ్ళూడిపోయినట్టు ఊడలు మాయం అయిపోతున్నాయి.

ఎడారంత దర్బార్ హాల్లో నేడు, అలనాటి రంగురంగుల లస్టర్లూ, గాజుదీపాలూ, తివాచీలు, రాతి స్తంభాల మీద అర్థరాత్రుళ్ళు వెలిగిపోయే కాగడాలూ, పెట్రొమాక్స్ దీపకాంతులూ అడుగడుక్కూ వంగి 'కుర్నిసాత్' ( ఆదరంగా చేసే నమస్కారం)లు చేసే నౌకర్లూ, భాల్‌దార్లూ, చోప్‌దార్లూ లేరు.

చిన్న మైదానమంత 'అశ్వశాల'లో అలనాడు అరబ్బీ మేలుజాతి గుర్రాలతో పాటు, రాజేగారి ఖాస్, బాండీ గుర్రాలుండేవి. లెక్కలేనంత 'సైసు'లుండేవాళ్లు. అదంతా కేవలం చరిత్ర!

ఆ చరిత్రను చూసి, అనుభవించిన, ఆనందించిన, 'రాయ్‌బాగన్' ' ఉదారాం' వంశపు ఆఖరి రాకుమారుడు రాజే మధుకర్ రావ్ దేశ్‌ముఖ్.

ఎనభై ఆరు వసంతాలు చూసినా, చెక్కుచెదరని ఆరడుగుల నిండువిగ్రహం.

వెనక్కి దువ్విన వెండిరంగు జుత్తు. అక్కడక్కడ స్వతంత్ర అభ్యర్థులా ఎదురు తిరిగి నిలబడ్డ వెంట్రుకలు.

కళ్ళద్దాల్లోంచి ధీరగంభీరంగానూ, అంతే ఆత్మీయంగానూ పలకరించే కళ్ళూ, పెదవులపై నలిగిపోని నవ్వూ.

తనే స్వయంగా దారం వడకి, నేసిన ఖద్దరు కుర్తా పైజామా చేతిలో ఉర్దూ షేర్‌షాయరీల పుస్తకం... ఉండేదిట.

ఒకప్పుడు 'నాసిక్'లోని భోంస్లా మిలటరీ కాలేజ్‌లో మిలట్రీ పాఠాలు నేర్చుకున్న ఎనిమిది పదులు పైబడ్డ నవయువకుడు ఇప్పటికీ ఛత్రపతి శివాజి సేనానిలా పెద్దపెద్ద అంగలేస్తూ హుందాగా నడిచి వచ్చి చిరునవ్వుతో చేయి కలిపి పలకరిస్తాడు.

''రండి రండి. స్వాగతం. ఇది మీ ఇల్లే లెండి. నేను కేవలం కాపలా కాస్తున్నాను'' అంటూ.

ఆగ్లం, ఉర్దూ, ఫారసీ, అరబ్బీ, హిందీ, గుజరాతీ, మరాఠీలో అనర్గళంగా సంభాషణ సాగుతుంది. మధ్య మధ్య కాఫీ, టీలకన్నా దూకుడుగా వచ్చే షేర్ షాయరీలు.

మేమే కాదు, మాతోనూ, మేము లేకుండానూ, రాజేసాబ్‌ను కలుసుకున్న ప్రతి గుండె పలికేది ఈ గీతమే.

''ఏ గలత్ కహా కిసీనే తెరా పతా నహీ హై!
తుఝె ఢూంఢనే కి హద్ తక్ కొయీ ఢూంఢతా నహీ హై''

(నీ చిరునామా లేదని ఎవరో తప్పుగా పలికారయ్యా బాబూలు ఎంతగా వెదకాలో, అంతగా వెదకనేలేదుగా?)

నిజం చెప్పాలంటే మేమూ వెదకలేదు. అంతా కాకతాళీయంగా జరిగింది. 'పూణే' నుంచి ట్రైన్‌లో వస్తున్నాము. మా కంపార్ట్‌మెంట్‌లో ఒకరి చేతిలో 'షికార్‌నామా' పుస్తకం కనిపించింది. అందమైన



18

కుమిలి కుమిలి ప్రాణం వదిలాడు.

వాటి మృత కళేబరాలను ఖననం చేసిన రోజు హవేలీలో ఎవ్వరూ మంచినీళ్ళు ముట్టుకోలేదట.

"రాజేసాబ్. మా హవేలీలో నౌఖర్లు అమావాస్య, పూర్ణిమలకే మారిపోతారు. లేదా పారిపోతారు. మీ హవేలీలో ఇన్ని సంవత్సరాలుగా వస్తున్నాం.. చూస్తున్నాం.. అడవి బంక పూసుకుని అంటుకుని పోయినట్టున్నారు వీళ్ళు. ఏమిటీ రహస్యం? అని హవేలీకి వచ్చే ఆత్మీయులు ఆశ్చర్యంగా అడిగేవాళ్ళు.

"మా హవేలీ ప్రత్యేకతే అదండి. వచ్చేవాళ్ళు మా హవేలీ ప్రేమలో పడి, శాశ్వతంగా ఇక్కడి వాళ్ళే అయిపోతారు. ఎక్కడో కొంకణ్ ప్రాంతంలో సర్దార్ ఆంగ్రే, గణపతి పూళే నుంచి సంవత్సరాల క్రితం వచ్చి తరతరాలుగా ఇక్కడి వాడైపోయిన వామన్ బాపట్, ముళ్ళకిరీటం బాబోయ్ అని బొంబాయి వదిలేసి వచ్చిన 'భాస్కర్ గద్రే' హైద్రాబాద్ నుంచి వచ్చిన వంటవాడు గురుభయ్యా, పంజాబ్‌నుంచి టెహల్ సింగ్, రాజస్థాన్ నుంచి వచ్చిన బద్దూసింగ్, బాపూసింగ్, రెహమాన్ ఇంకా ఎందరో కాస్తంత గర్వంగా చెప్పేవారు రాజే.

పూణే నుండి వచ్చేటప్పుడు ప్రయాణంలో చేతి కందింది వారు వ్రాసిన 'షికార్‌నామా' ఆ పుస్తకం ఇప్పుడు దొరకటం లేదు. ఎలాగో తిప్పలు పడి ఒక కాపీ సంపాదించి మళ్ళీ ఆవురావురు మంటూ చదివేస్తాం.

హాదిఖాన్‌కు మరాఠీ చదవటం రాదు. మర్ గయ్యే..డా..సాబ్ తో మరాఠీ మే హై అని తలకాయ పట్టుకుని కూర్చున్నాడు.

మాహోర్‌కు వ్రాసాం. వారి సెక్రటరీ జవాబు స్వయంగా తీసుకొచ్చి అందించాడు.

"మీ అందమైన అక్షరాలు అందాయి. అడవుల గురించీ, అడవి జంతువుల గురించీ తపించేవాళ్లు ఇంకా ఉన్నారన్న మాట. మీ రాకకోసం ఎదురు చూస్తూ ఉంటాను. తప్పకుండ రండి" అక్షరాల నిండా ఆత్మీయత అందింది.

అప్పటినుండి మా మహోర్ దండయాత్రలు అహర్నిశంగా సాగుతూ వచ్చాయి.

రాజుల వంశంలోని రూపలావణ్యాలకు మిలట్రీ జీవితపు డిసిప్లీన్ తోడైంది. గుర్రాలూ, గుర్రపుస్వారీ, అడవులూ, వన్యప్రాణులూ, షికార్, తుపాకులూ అంటే ప్రేమ. స్వతహాగా శాస్త్రీయ సంగీతం పట్ల అవగాహన ఉన్న గాయకుడు. బహుభాషా కోవిదుడు. మా ముచ్చట్లు కవిత్వపు జుగల్‌బందీలా సాగేవి. ముస్లిం 'లా' గురించీ, నమాజ్ గురించీ చక్కటి ఉర్దూలో విడమర్చి చెప్పేవారు.

హాదీ పరేషాన్..!

దేశ విదేశాల సాహిత్యం అలమారిల్లో హుందాగా ఆసీనమై ఉండేది. ఆయనకు ఎంతో ప్రీతి పాత్రమైన 'షికార్' సాహిత్యం, మచాన్ (పులివేటకు ఎత్తుగా చెట్లపై కట్టే కూర్చుండే జాగా) పై కూర్చుండి ఉంటే మరో మూల కాళీదాసు సంస్కృత రచనలు నవ్వుతూ వుంటాయి.

తన గంభీరమైన గొంతుతో అర్బీలో ఖురాన్, ఆయత్‌లను పఠనం చేయడం అంతే హృద్యంగా ఇక్బాల్ ఉర్దూ కవితలనూ, మర్డేకర్ మరాఠీ గీతాలూ గానం చేయడమూ ఆయనకే చేతనవును.

గాంధీగారి అహింసావాదాన్ని నొక్కి చెప్పే కళ ఆయనకే చెల్లింది. అవే క్షణాల్లో 'దరాఠీ' అడవుల్లో, ఒకే తూటాతో పెద్ద పెద్ద చారల పులిని ఎలా మోక్షం కల్గించారో చెప్పి మరీ చేతులు దులుపుకునే పద్ధతి మాకు నవ్వు తెప్పించేది.

ఇటు గాంధీవాదం అటు పులుల వేట గాథలు రెండు విపరీతమైన భిన్న ధృవాలు..

రెండు చెట్లమీది ఫలాలను ఆరగించడం అంటే ఇదేకాబోలు.

వారి పరిచయం మా హాబీల పరిధిని పెంచింది.

"కొందరు తనవారనీ, కొందరు పరాయివాళ్ళనీ సంకుచితమైన హృదయం ఉన్నవాళ్ళ భావన.. ఉదారమైన మనస్సులు సమస్త ప్రపంచం తమ కుటుంబం లాంటిదని భావిస్తారు మన రాజేసాబ్ లాగా.. వద్దూ వద్దూ అంటే ఆ దరిద్రం మతీన్ గాడ్ని చంపారు. వాడు చూసి రారా అంటే అస్సలు ఆ దిశ కేసి చూడని రకం. ఇప్పుడు ఏం చేస్తున్నాడో అసలు వెళ్ళాడో లేదో ఛీ..ఛీ.. బుర్రలు బద్దలు చేసుకుంటున్నాం. భాభీజాన్. ఏక్ కప్ గరమాగరం చాయ్. అందులోనూ మీరు ప్రత్యేకంగా చేసే అద్రక్ కీ చాయ్ ఉంటే బావుండు. సమోసాల్లేకున్నా ఫర్వాలేదు లెండి" అని చూరుకేసి చూస్తూ గోలగోలగా నసిగాడు సర్దార్ ఆలమ్.

చేతిలోని 'షేర్ ఓ షాయరీ పుస్తకం విసిరికొడ్తామా? వద్దులే అస్సలే షికారీగాడు. తప్పించుకుంటాడు. అనుకోని కోపంగా ఆలమ్ కేసి చూశాడు ఠాకూర్. ఇవేమి పట్టించుకోకుండా " ఆహా! రేపు ఇదే సమయానికి గెస్ట్‌హౌజ్‌లో రాజేసాబ్ మనం అందరం షికారీ గప్పాలు షేర్ ఓ షాయరీ, కబాబ్ దావత్‌లు వాహవా..." మురిసిపోతూ, చటుక్కున కిటికీవైపు తిరిగి జయ నుద్దేశించి అన్నాడు.

"భాభీజీ! గెస్ట్‌హౌజ్‌కు ఎవరు వెళ్ళి వచ్చారు? బాత్‌రూమ్‌లో సబ్బులూ, టవల్స్ మార్చమని చెప్పాను. ఎందుకైనా మంచిది, నేనే ఓసారి వెళ్ళి సబ్ కుఛ్ ఠీక్ ఠాక్ హై చూసి వస్తాను. రాజేసాబ్ వస్తే ఇంతెజామ్ చూసి వాహ్ క్యా బాత్ హై?' అనాలి" అని హడావుడిగా బయలుదేరాడు హాదీఖాన్.

'మతీన్‌గాడి మీద భరోసా లేదు" అన్నమాట నా చెవుల్లో గింగురుమనసాగింది. మహోర్‌కు మా అదిలాబాద్‌నుంచి 'సార్డా'వారి ప్రైవేటు బస్సు వెళ్తుంది. మతీన్ ఆ బస్సుకు కండక్టర్ అవసరం వస్తే డ్రైవర్ మరీ వీల్లేదు తప్పదూ అంటే చీఫ్ మెకానిక్. 'సార్డా'సర్వీస్‌లో కండక్టర్‌గా కుదరకముందు మతీన్ ఆర్టీసీలో కండక్టర్‌గిరీ వెలిగించాడు. హైదరాబాద్ వెళ్ళే బస్సులో ప్రయాణీకుల్ని లేపి, వడ్డరవాళ్ళనూ, వాళ్ళ గాడిదలనూ అడ్జస్ట్ చేశాడు. రామాయణ్‌పేట్ దగ్గర స్క్వాడ్ పట్టుకుంది. ఆశ్చర్యంగా చూసి అవాక్కయిపోయారు. అయినా తమాయించుకుని అడిగారు " ఏమిటయ్యా ఇదీ? ఎక్స్‌ప్రెస్ బస్సులో ప్యాసింజర్లు నిలబడ్డం ఏమిటీ, సీట్లమధ్య ఈ దరిద్రం గాడిదల గోల ఏమిటీ?" అని.

నింపాదిగా, శాంతంగా జవాబిచ్చాడు మతీన్ సాబ్.

" యూ ఆర్ రైట్ సార్. నేను వాళ్ళకు చెప్పా. అయ్యా మీరు గాడిదలూ. ఇది గాడిదల బస్సుకాదు నాయనా. అయినా గాడిదలే గాడిదలు తోసుకుని లోపలికి వచ్చాయి. ఆ గాడిదలూ ఈ గాడిద కొడుకులూనూ."

ఆ క్షణంలో అక్కడికక్కడే సస్పెండ్ అయ్యాడు మతీన్.

అలాంటివాన్ని రాజేసాబ్ దగ్గరికి పంపి 'మీరు అదిలాబాద్ వచ్చే కార్యక్రమంలో ఏం మార్పు లేదు కదా? ఇక్కడ ఉన్నతాధికారులూ, మిత్రులూ మీకోసం ఎదురు చూస్తున్నారు. మీరు అర్జంటుగా నాగ్‌పూర్ వెళ్ళాల్సి వుంది అన్నందువల్లే ప్రత్యేకంగా మతీన్‌ను పంపిస్తున్నాం. మీరు వచ్చే రోజును కన్ఫర్మ్ యచేసి మతిన్‌తో తెలపగలరు" అన్న సమాచారం తెలిపాము.


బస్సులోనే కాదు, బస్సు బయట కూడా వాడి లీలలు తెలుసు కాబట్టి ఉత్తరం కూడా రాసి ఇచ్చాము.

ఆ పూట మా బేచైనీకి కారణం.. మతీన్‌గాడు అక్కడ వెళ్ళి ఏం కథలు సృష్టించాడో అన్నదే! మాటి మాటికి హాదీ, ఠాకూర్, ఉలిక్కిపడి డా..సాబ్.. మన





19




వాడు మెసేజ్ సరిగ్గా ఇచ్చాడంటారా? ఇస్తే రేపు రాజాసాబ్ రావాలి. ఎందుకైనా మంచిది. మేము స్వయంగా గెస్ట్‌హౌజ్ చెక్‌చేసి వస్తాం'' అని బయలుదేరారు.

వారితోపాటు మెట్లు దిగి కారు దాక వచ్చిన నేనూ, జయా షాక్ తిన్నాం.

ఎదురుగా రిక్షాలో చిన్నసూట్‌కేసూ, బ్యాగ్ తీసుకుని, కోటు వేసుకున్న పొడుగాటి పెద్దమనిషి అటూ ఇటూ ప్రశ్నార్థకంగా చూస్తూ వస్తున్నాడు.

''మాదీ! రిక్షాకేసి చూడూ. రాజేసాబ్ కారు కదా?'' అన్నాను కంగారుపడుతూ.

''ఆ రాజేసాబ్. ఆయనెప్పుడూ కుర్తాపైజామాలోనే ఉంటారు కదా. ఈ పెద్దమనిషి సూట్‌బూట్‌లో ఉన్నారాయే. పైగా ఆయన వచ్చేది రేపుకదా? మతీన్ నిన్నకదా వెళ్ళాడు. ఈ పూట వచ్చి మనకు చెప్తాడుగా?'' హాదీ మనసులో అనుమానం.

''అయినా ఈ దరిద్రం మతీన్‌గాడు దొంగ కొడుకు. ఏం అఘోరించాడో'' అన్నాడు.

రిక్షా మమ్మల్ని దాటి కాస్త ముందుకెళ్లింది.

మేం నిట్టూర్చి 'హమ్మయ్య' అనుకునేంతలో మళ్ళీ వెనక్కి తిరిగి వచ్చి, మాముందు నిలబడింది.

''రేపు రావల్సిన పెద్దమనిషి ఇవ్వాళ వచ్చేడేమిటీ'' అని మేము కంగారుతో ఆలోచిస్తున్నాం.

''రేపు రావలసిన వాడిని, చెప్పా చెయ్యకుండా ముందే దిగాను. ప్చ్! ఏం చెప్పనూ?'' అని రాజేసాబ్ మనసులో గిల్టీగా ఫీలయిపోతున్నాడు.

సమయం సందర్భం చూసి జయా కలగజేసుకుంది.

''అరే! రాజేసాహేబ్! బావుంది. మేం అందరం మీ గురించే ఆలోచిస్తున్నాం. మీరు ఒకరోజు ముందుగా వచ్చారంటే అదంతా మా అదృష్టం. మీ కంపెనీ ఇంకోరోజు పొందామన్న మాట. రండి రంకి.. ముందు ఇక్కడే ఫ్రెష్ అయి, కాఫీ తాగండి. పదండి''

అందరం కులాసాగా నవ్వుకున్నాం.

హాదీఖాన్ హడావుడిగా గెస్ట్‌హౌస్‌కు వెళ్ళిపోయడు. ఇంతెజాం ( ఏర్పాట్లు) చూడ్డానికి.

ఠాకూర్ రోడ్డుమీద పడ్డాడు. ఆ దొంగ గాడిద కొడుకు మతీన్ గాడెక్కడున్నాడు చూసి నాలుగు తన్ని వస్తాను. ఛీ ఛీ యూస్ ఫెల్లో.

ఆ యూస్‌లెస్ ఫెల్లో రెండు రోజుల తర్వాత రెండుక్షణాలు కన్పించి 'రాజాసాబ్ వచ్చారుకదా? ఏవిటో. నేను యమబిజీగా వున్నాను. రేపూ ఎల్లుండీ కుదరదూ, వెంఠనే రండి. తీసుకెళ్తా అన్నాడు. షేర్‌లు చెప్పవయ్యా షాయరూ అన్నారు. షేర్లు చెప్పడానికసలు టైమేదీ? అని యమస్పీడుగా జారుకున్నాడు.

రాజేసాబ్ ఆదిలాబాద్‌లో గడిపిన రోజుల గురించి తర్వాత రాసుకున్నారు. వియస్‌కె కౌముది గారు యస్పీ. ఆరోజుల్లో ఇంటిల్లిపాదీ పిల్లలూ రాజేగారి షికారి అనుభవాలను విని పులకించిపోయారు. శ్రీ రామచందర్‌గారు సర్కిల్‌ఇన్స్‌పెక్టర్‌గా ఉన్నారు. ''ఏం సార్! ఎవరో రాజాగారు వచ్చారట. బాడీగార్డ్స్ కావాలంటారా? చాలా పనులున్నాయి. ఐదు నిముషాలు కలిసి వెళ్తాను'' అన్న మనిషి ఐదుగంటలకు పైగా అక్కడే ఉండిపోయారు.

''బాప్‌రే! ఏం వ్యక్తిత్వం సార్? రాజులంటే ఏమో అనుకున్నా... రాజులంటే ఇలాగే వుండాలి. అబ్బబ్బా! ఏం నాలెడ్జ్? ఏం తెలివి? ఆహా! ఇంకో రెండ్రోజులు ఉండమనండి. మన సామ్రాజ్యంలోని వింతలు చూయిద్దాం'' అన్నారు ఖుషీగా నవ్వుతూ.

'హాదీఖాన్ని కబాబ్‌లూ, ఠాకూర్‌సాబ్ ఇంటి చేపల పులుసూ, మా ఇంటి పురణ్‌పోళీలూ.. రాత్రి 12 గంటల వరకూ భార్యాపిల్లలతో వచ్చిన మా మిత్రుల ఆత్మీయతలకు కదిలిపోయారాయన.

''మంచివాళ్ళ సాంగత్యంలో గంటలు క్షణాలుగా గడచిపోతే.. మనలోని చెడుగుణాలు కూడా మంచి గుణాలుగా మారిపోతాయి. మంచి మనుషుల్లో వెన్నలాంటి మనసులను చూశాను. రాజరికాలూ, జమీందారీలు పోయాయి. ఆ వైభవం గురించి చెప్తే, 'కాకమ్మ కథలూ' అనుకుంటారు. ఆనందం అనేది ప్రపంచంలో ఎక్కడో లేదు. అది మీలాంటి మంచి మనుష్యుల మనస్సు లోతుల్లో ఉంటుంది'' అని కాసేపాగి మళ్ళీ కొనసాగించారు.

'' ఆద్మీ వో నహీ హలాత్ బదల్ దే జిన్‌కో!

ఆద్మీ వో హై- జో హాలాత్ బదల్ దేతే హై''

(పరిస్థితుల వల్ల మారిన వాడు మనిషి కాదు. అసలుసిసలు మనిషి ఎవరంటే ఆ పరిస్థితులను మార్చేవాడే) మనం 'మతీన్'ను తిట్టుకోవడం దేనికి?

నన్ను అక్కడా, మిమ్మల్నందర్నీ ఇక్కడా ఇబ్బందులో పడేసినా, అందమైన అపురూపమైన క్షణాలు మనందరికీ దోసిళ్ళకొద్దీ అందించాడుగా''

అందరం నవ్వుకున్నాం.

నేనూ, శివ్వన్నా, ఠాకూర్‌గారూ మాహోర్‌లో వారితోనే ఉన్నప్పుడు ఆదిలాబాద్‌లో హఠాత్తుగా 'గుండెనొప్పి'తో పోయాడు హాదీఖాన్.

అది తెలిసి, స్థాణువులా కూర్చుండిపోయారాయన. హాదీ ఆయనకు ప్రెజెంట్ చేసిన ఫౌంటెన్ పెన్‌ను తీసి చేత్తో నిమిరారు.

''జీవితం నీటిబుడగ. బ్రతుకు బుద్బుదమైనది. తెగిన గాలిపటం లాంటిది. బతికినన్నాళ్ళు ఏవో దుఃఖాలు. చచ్చిన తర్వాత మిగిలిన వాళ్ళకు దుఃఖం. చచ్చినా బ్రతికినా ఎన్ని సుఖాలనుభవించినా దుఃఖం 'నేనున్నాను సుమా!' అని సంతకాలు పెడ్తూనే వుంటుంది''

లెక్కలేనన్ని వన్యప్రాణులను వేటాడి బలితీసుకునన ఆయన 'మెంచెస్టర్ డబుల్ బ్యారెల్ రైఫిల్'ను చూయించి, 'చూశారా! దీని స్పర్శ. చల్లగా, వణుకుపుట్టేట్టు! కాని, ఆరోజుల్లో తూటాలు కక్కి వేడి నెత్తురును చిల్లించేది. ఇప్పుడు షికార్ బంద్! నేను తుపాకితో కాక కెమెరాతో షూట్ చేసి ఉంటే బావుండేదేమో. కనీసం మేం చంపిన వందల కొద్దీ జింకలూ, సాంబర్లూ, నీల్‌గాయలూ ఫొటోల్లో అమరయ్యేవి కదా''

రాణీ ఇందుమతి గారు మెల్లగా నడచివచ్చి 'టీ తీసుకుంటారా?' అని అడిగారు. ఎనిమిది పదులు దాటిన ఆ జంట టీ తాగుతూ కవిత్వం గురించి ముచ్చటించసాగారు.

'' ఉజాలే అప్ని యాదోంకే హమారే సాథ్ రహ్నేదో

నజానే కిస్ గలీమే జిందగీకి షామ్ హోజాయే''

(మిత్రమా! నీ జ్ఞాపకాలు వెలుగులు నా వెంట ఉండనీ.. ఏ చీకటి సందులో జీవిత సంధ్య అలముకుంటుందో తెలియదు కదా?)

* * *

ట్రింగ్..ట్రింగ్!!

ఫోన్ ఎడతెరిపి లేకుండా మోగుతుంది.

''హల్లో! నేను రాజేసాహెబ్ సెక్రటరీని మాట్లాడుతున్నాను డాక్టర్‌గారూ! బహుత్ బురీ ఖబర్ హై.. తుపాకి శుభ్రం చేస్తుంటే ప్రమాదవశాత్తు పేలి రాజేసాహెబ్ కన్నుమూశారు. మీకు మీ...''

అవతలివైపు నుండి వెక్కిళ్ళు వినిపించాయి.

దూరంగా సన్నగా ముకేష్ గీతం విన్పించింది.

''జానే చలే జాతే హై కహా?

దునియాసే జానే వాలే!!''

చాలారోజుల తర్వాత, చేతిలో కర్ర ఆధారంగా, అతికష్టంలో మెట్లెక్కి హాల్లోకి వచ్చాడు మతీన్.

నిలబడే మెల్లగా చెప్పాడు...

''డా.సాబ్! మాహోర్ పోయినప్పుడల్లా నేనే రాజేసాబ్‌ను బ్రతిమాలి షేర్‌లు రాసుకునేవాడిని. ఈ డైరీ నిండా ఆయన షేర్‌లే ఉన్నాయి..''

నేను డైరీని తెరిచాను.

మొదటి పేజీలో 'షేర్.. 'పులి' ఉంది...!



20